క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న సర్పంచ్ చిట్టిబాబు

సఖినేటిపల్లి: గ్రామంలో ప్రముఖ దాత స్వర్గీయ కుచ్చర్లపాటి సూరపరాజు జ్ఞాపకార్థం ఆ కుటుంబ సభ్యుడు డి.శ్రీనురాజు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ప్రారంభించారు. ప్రయాణికులకు, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జంపన బుజ్జిరాజు, ఉప సర్పంచ్ ఇందుకూరి రమేష్‌రాజు, నాయకులు ఆరిపల్లి సత్యనారాయణ, వెలుగొట్ల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు తొలగించండి



చిరతపూడిలో శిథిలమైన వాటర్ ట్యాంకు

అంబాజీపేట: ప్రమాదభరితంగా ఉన్న వాటర్ ట్యాంకును తక్షణమే తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల ని చిరతపూడి శివారు లంకవారిపేటవాసులు కోరుతున్నారు. 2019లో రూ.20.25 లక్షలతో వాటర్ ట్యాంకును నిర్మించిన తరువాత ఆరు నెలల పాటు అడపదడపా తాగునీరు అందించారు. అనంతరం వివిధ కారణాలతో వినియోగంలో లేకపోవడంతో శిథిలమైపోయింది. దాంట్లో ఉన్న విద్యుత్ మోటారు, పైపులను సంబంధిత అధికారులు తీసుకువెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే వాటర్ ట్యాంకును తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు అండగా ఉండాలి



అంబాజీపేటలో మాట్లాడుతున్న ఏడీఏ

అంబాజీపేట: కోతలు పూర్తయి, ధాన్యం మిల్లులకు చేరేంత వరకూ రైతులకు అండగా ఉండాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి అన్నారు. అంబాజీపేట మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ జూన్ రెండో వారానికి ఖరీఫ్ నారుమడులు వేసుకోవాలన్నారు. త్వరగా వరి నాటు వేసుకోవడం వల్ల నవంబర్‌లో తుపానులకు నష్టపోకుండా ఉంటామన్నారు. ఈ నెలలో రైతులకు పీఎం కిసాన్, రైతు భరోసా విడుదల చేయనున్నారన్నారు. రైతు భరోసా రానివారు, కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు ఈ నెల 15 నుంచి 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పీఎస్‌పీ లక్ష్మి, ఏఈఓ డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మాల్యాల వెంకట మహదేవకుమార్, రేణుక దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

డీఈఓకు వినతి

అమలాపురం రూరల్: ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో పనిచేయాలని వారిపై ఒత్తిడి తేవడానికి వీల్లేదంటూ డీఈవో కమలకుమారికి యూటీఎఫ్ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కోనసీమ ఎస్టీయూ అధ్యక్షుడు శివప్రసాద్, యుటీఎఫ్ నాయకులు సురేష్ కుమార్, బేతినిటి శ్రీనివాస్, వై.మురళీ, ఏవీ రమణ తదితరులున్నారు.

విద్యార్థికి సత్కారం

అమలాపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించిన విద్యార్థి యశ్వంత్ కృష్ణను బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి వీరబ్రహ్మం, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామి శుక్రవారం అభినందించారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు వూటుకూరి సోమరాజు రూ.10,116 ప్రోత్సాహక బహుమతిగా అందించి సన్మానించారు. కార్యక్రమంలో యశ్వంత్ తల్లిదండ్రులు అంకం బాల సోమశేఖర్, రమాదేవిలతో పాటు కోనసీమ దేవాంగ సంఘ ప్రతినిధులు జాన శంకరరావు, పిచ్చిక శ్యామ్, బళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం

- డ్రెన్లను తలపిస్తున్న పంట కాలువలు
- తాగునీటి పథకాలకు ఈ నీరే దిక్కు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు



మొగలికుదురు సాయిబాబా గుడి వద్ద పంట కాలువలోకి మురుగునీటి తూర



మామిడికుదురులో డ్రైన్‌ను తలపిస్తున్న పంట కాలువ

మామిడికుదురు: ప్రధాన పంట కాలువలు మురుగునీటి డ్రైన్లను తలపిస్తున్నాయి. పంట కాలువల్లో ఎక్కడ చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. తమ స్వార్థం కోసం పలువురు ఇళ్ల నుంచి మురుగునీటి తూరలను నేరుగా పంట కాలువల్లోకి మళ్లిస్తున్నారు. దీంతో పంట కాలువలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. ఈ కాలువల్లో ప్రవహించే నీటినే తాగునీటి పథకాలకు మళ్లిస్తున్నారు. తద్వారా తాగునీరు కాలుష్యమవుతోంది. వాటిని తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఎంతో కాలంగా ఈ సమస్య ఉన్నా అరికట్టే నాథులే కనిపించడం లేదు. మురుగు నీటికి తోడు వ్యాపారులు వ్యర్థాలు తెచ్చి పడేస్తూ మరింత కలుషితం చేస్తున్నారు. పంట కాలువలను డస్ట్‌బిన్ల తరహాలో వినియోగించడంతో పంట కాలువలు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.

పంట కాలువల పరిస్థితి ఇదీ..

పి.గన్నవరం ప్రధాన పంట కాలువ నుంచి నాగుల్లంకలో వేరు పడిన ప్రధాన పంట కాలువ నీటిని పాశర్లపూడిలోని కొట్టు మెరక తాగునీటి ప్రాజెక్టుకు మళ్లిస్తున్నారు. నాగుల్లంక గ్రామ పరిధిలోని పలు గృహాల నుంచి డ్రైన్ నీటిని, లెట్రిన్ గొట్టాలను పంట కాలువలోకి విడిచి పెడుతున్నారు. దీనిపై రెవెన్యూశాఖ ఉన్నతాధికారులకు స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మామిడికుదురు, మొగలికుదురు ప్రధాన పంట కాలువల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఈ కాలువలోకి పలు గృహాలకు చెందిన మురుగునీటి తూరల్ని నేరుగా భూగర్భం ద్వారా పంట కాలువలోకి ఏర్పాటు చేశారు. దీంతో పంట కాలువ నీరు పూర్తిగా కలుషితమవుతోంది. ఈ కాలువ నీరు పలు తాగునీటి ప్రాజెక్టులకు సరఫరా చేస్తున్నారు. మురుగునీరు, డ్రైన్ నీటితో ప్రజలకు ఆరోగ్య పరమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటిపై అధికారులు తక్షణం స్పందించి పంట కాలువల్లోని మురుగు నీటి తూరల్ని తొలగించే దిశగా తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కాలువల్లో వ్యర్థాలు



పంట కాలువలను చూస్తే భయమేస్తోంది. ఎక్కడ చూసినా మురుగునీటి తూరలే కనిపిస్తున్నాయి. లెట్రిన్ గొట్టాలను సైతం కాలువల్లోకి విడిచి పెడుతున్నారు. దీనికి తోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇళ్లలోని చెత్తను కాలువల్లోకి విసిరేస్తున్నారు. పంట కాలువలు పెంట కుప్పలను తలపిస్తున్నాయి. కాలువల కన్నా డ్రైన్లే పరిశుభ్రంగా ఉంటున్నాయి.

– చేట్ల సత్యనారాయణ, రైతు, ఈదరాడ

అధికారులకు చెప్పినా...



పంట కాలువల్లోకి విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన తూరల్ని తొలగించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలువలోకి దిగి పని చేసేందుకు కూలీలు భయపడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చును. ఎన్ని సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– అల్లు బుజ్జి, మామిడికుదురు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడి నెల్లివారిపేటలో పంట కాలువపై రూ.10 లక్షలు ఓఎన్‌జీసీ నిధులతో నిర్మించనున్న కల్వర్టుకు ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉన్న సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామన్నారు. నెల్లివారిపేటలో కల్వర్టు పాడైపోయి ఎంతో కాలమైనా ఎవరూ పట్టించుకోలేదని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడడం లేదని పక్కా సీసీ రోడ్లతో పాటు బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ యాదీవీ సత్యనారాయణ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్‌లు కొనుకు నాగరాజు, మొల్లేటి త్రిమూర్తులు, అప్పనపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పిచ్చిక చిన్న, పార్టీ నేతలు నక్కా వెంకటేశ్వరరావు, తోలేటి బంగారు నాయుడు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎంపీపీ గంగాధరరావు
- కొత్తపేట మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి పార్టీ రహితంగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగింది. సభకు జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి హాజరయ్యారు. వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, ఉపాధి శాఖలపై సమీక్షిస్తూ ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, సర్పంచ్ రెడ్డి చంటి మాట్లాడుతూ చానల్స్ పూడికతీత, తూటు, తుక్కు తొలగింపు పనులు సాగునీరు విడుదలైన తరువాత కాకుండా ముందే పూర్తి చేయాలని కోరారు. గత ఏడాది ముందస్తుగా సాగునీరు విడుదల చేసినా చానల్స్ ద్వారా సకాలంలో నీరు పారక నాట్లు జాప్యం జరిగి, పంట ఆలస్యమై ఇటీవల అకాల వర్షాలకు వరి పంట తడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పలు పిల్ల కాలువల్లో వ్యర్థాలు ఉండడంతో బాగుజేసేందుకు ఉపాధి కూలీలు ముందుకు రావడం లేదని ఏపీఓ అన్నారు. అటువంటి కాలువల పనులు పంచాయతీల ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గంగాధరరావు పంచాయతీ అధికారులను ఆదేశించారు. కొత్తపేట సత్యా సెంటర్ వద్ద మండల పరిషత్ నిధులతో పూర్తి చేసిన డ్రైన్ నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ఉందా? అని మోడేకుర్రు ఎంపీటీసీ (టీడీపీ) సభ్యుడు రెడ్డి శ్రీనివాసరావు ప్రశ్నించారు. తీర్మానం ఉందా? లేదా చెప్పండి! అని ఎంపీపీ సంబంధిత పంచాయతీ కార్యదర్శి వీవీ రామన్‌ను ప్రశ్నించగా తీర్మానం ఉందని జవాబిచ్చారు. అభివృద్ధి చేస్తే మీకు అభ్యంతరం ఏమిటి? అని స్థానిక ఎంపీటీసీ సభ్యులు విళ్ల వీర్రాజు, పేపకాయల బ్రహ్మానందం ప్రశ్నించారు. ఆ సందర్భంగా వాగ్వివాదం జరిగింది. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో చేపట్టే కార్యక్రమాలకు ఆయా గ్రామ పంచాయతీల తీర్మానం అవసరం కాగా ప్రతిపక్ష పార్టీ సర్పంచుల గ్రామాల్లో తీర్మానాలు సకాలంలో ఇవ్వక అభివృద్ధి జాప్యమవుతుందన్నారు. ఈ ఇబ్బందులతో పనులు చేయడానికి ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు వెళ్లిపోతున్నారన్నారు. గత టీడీపీలో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు ఒక్క వర్కు ఇవ్వలేదన్నారు. అయితే తాము వారి విధానానికి భిన్నంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజక వర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి లక్ష్యం, పారదర్శక పాలనకు అనుగుణంగా మండలంలో ఎంపీటీసీ సభ్యులందరినీ సమానంగా గౌరవిస్తున్నామన్నారు. పార్టీ రహితంగా, పారదర్శకంగా, వివక్షతకు తావులేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఆసరా, ఉన్నతి పథకానికి ఏమైనా సంబంధం ఉందా? ఉన్నతి లోను తీసుకున్న వారికి ఆసరా సొమ్ము ఇచ్చేందుకు యానిమేటర్లు ఇబ్బంది పెడుతున్నారని ఎంపీటీసీ సభ్యురాలు పల్లి శాంతి ప్రస్తావించారు. దానిపై ఏపీఎం విశ్వనాథం జవాబిస్తూ సంబంధం లేదని అయితే 2016 నుంచీ ఉన్నతి రుణాల చెల్లింపులు సక్రమంగా లేక బకాయిలు ఉండిపోయాయన్నారు. దానిపై ఎంపీపీ మాట్లాడుతూ వాటిని చెల్లిస్తే మళ్లీ మరింత మందికి రుణం ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంకా వివిధ శాఖలపై సమీక్షించారు. ఈ సమావేశంలో వైఎస్ ఎంపీపీలు బండారు సత్యమంగతాయారు, దంగేటి వెంకటనాగమణి, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, తహసీల్దార్ జీడీ కిషోర్ బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక వెలి ఘటనపై ప్రజా సంఘాల విచారణ



వెలిపై విచారణ చేస్తున్న ప్రజా సంఘాల కమిటీ

మలికిపురం: గూడపల్లి పల్లిపాలెంలో చోటు చేసుకున్న సామాజిక వెలి ఘటనపై రాజోలు నియోజక వర్గానికి చెందిన ప్రజా సంఘాలు శుక్రవారం విచారణ నిర్వహించాయి. పడమటిపాలెం గ్రామానికి చెందిన మోకా సుజాత, పల్లిపాలెం గ్రామానికి చెందిన కొల్లు దుర్గాప్రసాద్ వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు. కొంత కాలం క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల గ్రామంలో కొందరు వీరిని వెలి వేసినట్టు సామాజిక మాధ్యమాలలో ప్రచారంలో ఉండడంతో నిజ నిర్ధారణ పేరుతో ప్రజాసంఘాలు శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించాయి. వెలి వేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పడమటిపాలెం గ్రామానికి చెందిన దొండపాటి అర్జునరావు, తాడి శివాజీ తదితరులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల తరపున గెద్దం బాలరాజ్, ముత్యాల శ్రీనివాస్, చింతా సత్య తదితరులు విచారణలో పాల్గొన్నారు. కాగా ఈ అంశంపై మలికిపురం ఎస్సై సురేంద్రను వివరణ కోరగా దీనిపై ఎటువంటి ఫిర్యాదు లేదని సామాజిక మాధ్యమాలలో వచ్చిన అంశాలపై గ్రామస్తులను కబురు చేశానని పేర్కొన్నారు.

పంట కాలువలు అభివృద్ధి చేయాలని వినతి



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి శోభ

అయినవిల్లి: వేసవిలో ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పంట కాలువలను అభివృద్ధి చేయాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాల్లో వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ శాఖ అధికారి వై.శోభ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందన్నారు. రైతులు వ్యక్తిగతంగా యంత్ర పరికరాలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుటుందన్నారు. పండించిన ధాన్యానికి లోకల్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పచ్చిమాల సుబ్బారావు, ఆహార కమిటీ సభ్యుడు మానేపల్లి గణపతి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మండల ఇటుక బట్టీ యజమానుల సమాఖ్య

ఆలమూరు: ఇటుక బట్టీల యాజమాన్యాలకు అవసరమైన మట్టికి విధించే అపరాధ రుసుం తగ్గింపునకు కృషి చేసిన కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి మండల ఇటుక బట్టీల యాజమాన్య సంఘ సమాఖ్య అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలమూరులో స్థానిక బట్టీ యజమానులతో కలిసి ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, ముడిసరకుల పెరుగుదల వల్ల తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో అధికారులు, నిర్వాహకులతో మాట్లాడి ఇటుక బట్టీలకు అపరాధ రుసుం తగ్గింపు తమకు ఎంతో ఊరట కల్పించిందన్నారు. భవిష్యత్‌లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అందరూ అండగా ఉందామని తీర్మానించారు. రామానుజుల శేషగిరిరావు, పామర్తి శ్రీనివాసు, జొన్నాడ అబ్బు, చామకూరి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం



డ్రైన్ పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం(డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీ శంకర్ కోరారు. డ్రై డే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాల్లో నీరు, వ్యర్థాలు ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరి అంటు వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పి.వి.రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు రాజోలులో జాతీయ లోక్ అదాలత్

రాజోలు: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంఘ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలరాణి శుక్రవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో నిర్వహించనున్న ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడిన క్రిమినల్ కేసులు పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రి.లిటిగేషన్‌కి సంబంధించి బ్యాంక్ కేసులు, బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కామవుతాయన్నారు. ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1979 నుంచి 1984 సంవత్సరం బ్యాచ్‌లలో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవార నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు శ్రీపాద వెంకటేశ్వర్లు, రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు, కామిశెట్టి మాచరమ్మ, పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న వారు 40ఏళ్ల తర్వాత కలుసుకుంటున్నారని, అందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. 40 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులంతా ఒకే చోటకు రావడం సంతోషకరమని అన్నారు.

సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల టీమ్‌తో అసోసియేషన్ సభ్యులు

ముమ్మిడివరం: తూర్పుగోదావరి జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర, బాలికల టీమ్ కోచింగ్ క్యాంప్‌ను ఐ.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు భూపతిరాజు చంటిబాబు ప్రారంభించారు. కోచింగ్ అనంతరం జిల్లా టీమ్ కడప జిల్లా రాయచోటిలో ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగే అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొంటుందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.సురేష్‌బాబు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రేవు సారెడ్డి, జంపా సత్యనారాయణ, పాఠశాలల పీడీ మూర్తి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.ఎస్. రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన



విలసవిల్లిలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో రూ.12.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి సౌకర్యం ఉండాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, బీర నరసింహమూర్తి, కోలా ఏసు, బీర శాంతకుమారి, ఉంగరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బాబా ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు.

కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ సమావేశం



కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ సమావేశంలో పాల్గొన్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రొయ్యలు, చేపల సేద్యానికి సంబంధించి అనుమతుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఏడు దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయని వాటిని పరిశీలించి అనుమతిస్తామని చెప్పారు. సమావేశంలో రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి చైర్మెన్‌గా వ్యవహరించగా సభ్యులుగా మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, పీడబ్ల్యూడీ ఈఈ, డిప్యూటీ డైరెక్టర్ ఆక్వాకల్చర్, డిప్యూటీ తహసీల్దార్, ఏడీ ఫిషరీస్ వ్యవహరించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకోవడానికి మే 31 ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసై ఉండాలన్నారు. జులై 22న నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల్ని ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయ యానాం వారిని సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

అమలాపురం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారమివ్వాలని రూరల్ సీఐ వీరబాబు అన్నారు. రూరల్ ఎస్ఐ అందే పరదేశి ఆధ్వర్యంలో కామనగరువు గ్రామ పంచాయతీలో షాపుల యజమానులకు, స్థానికులకు శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఇళ్లకు తాళాలు వేసుకుని ఊరు వెళుతుంటే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అలాంటి ఇళ్లకు మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరైనా ఆ ఇళ్లల్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తే అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం అందుతుందని, తద్వారా వారిని సులువుగా పట్టుకోవొచ్చని చెప్పారు. తాలూకా ఎస్ఐ పరదేశి మాట్లాడుతూ రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ మరింత పెంచుతామన్నారు. సమావేశంలో సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు.

అక్షయ పాత్రకు కూలర్ల బహూకరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్యాత్మిక సంస్థకు పలువురు దాతలు రూ.64 వేల విలువైన రెండు వాటర్ కూలర్స్‌ను శుక్రవారం బహూకరించారు. స్థానిక దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన అక్షయ పాత్ర, గోశాల సేవకులు నూకల నాగేంద్ర వర ప్రసాద్, కుమారి దంపతులు రూ.24 వేల విలువైన వాటర్ కూలర్, ఓ అజ్ఞాత భక్తుడు రూ.40 వేల విలువైన వాటర్ కూలర్ అందించారు. అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నడుస్తున్న చలి వేంద్రం నిర్వహణకు ఉప్పలగుప్తం మండలం నంగవరానికి చెందిన జిన్నూరి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రాజేష్, చల్లపల్లి గ్రామానికి చెందిన అన్నంనీడి బాబా వీరేంద్ర, నల్లా కొండబాబు రూ.3000 వంతున విరాళాలు అందించారు.